క్లుప్తంగా

ఉత్తమ టీచర్లకు అవార్డులు

మదనపల్లె సిటీ: యువతేజం ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలో శనివారం ఉత్తమ టీచర్ల అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు డాక్టర్ సుబ్రమణ్యం చేతుల మీదుగా మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పి.మహమ్మద్‌ఖాన్, ఆర్‌వి రమణ, షేక్ ముబారక్‌బాషా,ఎల్.బావాజాన్‌లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ద్రావిడ యూనివర్సిటీ మాజీ వీసీ రత్నమయ్య, ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎస్ కె కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద కారకుడిపై కేసు

కలకడ : రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. సంబేపల్లె మండలం, ఎస్.సోమవరం పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నగిరిమడుగు పెద్దనాగన్నను బుధవారం మరో ద్విచక్రవాహనం ఢీకొంది. కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె ఎస్టీకాలనీకి చెందిన బుక్కే బాబునాయక్ కుమారుడు మల్లికార్జున నాయక్ ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి పెద్దనాగన్న వాహనాన్ని ఢీకొన్నాడు. గాయపడ్డ పెద్దనాగన్న కుమారుడు సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మహా కరుణ మహాయజ్ఞం

మదనపల్లె : పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ (పీఎస్ఎస్ఎం) ఆధ్వర్యంలో పట్టణంలోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్న మహా కరుణ మహా యజ్ఞాన్ని విజయవంతం చేయాలని పీఎస్ఎస్ఎమ్ సభ్యులు కోరారు. శనివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...బ్రహ్మర్షి పితామహ పత్రీజీ స్ఫూర్తితో మహా కరుణ మహాయజ్ఞం, మహా కరుణ శాకాహార మహా సద్భావన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి పెద్దసంఖ్యలో రుషులు, పిరమిడ్, యోగా గురువులు, శాఖాహారులు తరలివస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా సంగీత విద్వాంసులతో మహా సంగీత వేణునాధ ధ్యానం, విశేష నృత్యకార్యక్రమాలు, బ్రహ్మర్షులు, విశిష్ట గురువుల సందేశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్.సుబ్బారెడ్డి, కృష్ణకుమార్, మునికృష్ణ, మంజుల, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్ర రెడ్డి

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్తూరు 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్సా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి, ఏ ఏ ప్రమాదాలకు ఎలా స్పందించాలి అనే ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రథమ చికిత్స బాక్స్ ప్రతి పాఠశాలలో ఉండాలని, విపత్తుల సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాము కాటు, వడదెబ్బ, హార్ట్ స్ట్రోక్‌కు సిఆర్‌పి, నీట మునగటం, కాలిన గాయాలు, దెబ్బలు తగిలించుకోవడం, ఎముకలు విరగడం వంటి వాటికి ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేషపూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు విశేషమైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఫ్రైడే డ్రైగా పాటిస్తే దోమల నివారణ సాధ్యం

వాల్మీకిపురం: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తే దోమల నివారణ సాధ్యం అవుతుందని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం మండలంలోని గండబోయనపల్లిలో ప్రజలకు దోమకాటు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు జ్వరాలు వస్తాయన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరసర ప్రాంతాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని, ప్రతి రోజు ఇంట్లో సాయంత్రం పచ్చి వేపాకు పొగ వేసుకోవడం వంటివి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య మరింత భారమవుతుంది



నీట్ రాసి వైద్య విద్య చదవాలని అందరికీ కల ఉంటుంది. ప్రభుత్వ వైద్య కాలేజీల్లో సీటు సాధించాలనే తపనతో నీట్ పరీక్ష రాశా. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మెరిట్ విద్యార్థులకు వైద్య విద్య మరింత భారం కావడం ఖాయం. లక్షలు ఖర్చు చేసి చదివే శక్తి పేదలకు ఉండదు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహిస్తే బాగుంటుంది. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెంచితే పేద విద్యార్థులు మరింత మంది వైద్యవిద్య అభ్యసించే అవకాశం ఉంటుంది. వైద్య విద్యను అభ్యసించాలనే విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలవాలి.

-చిగువింటి పవిత్ర, నీట్ విద్యార్థిని, మదనపల్లె



ప్రైవేటీకరణ సరికాదు



ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలు ప్రారంభించాల్సి ఉంది. తద్వారా ఒక్కో కాలేజీకి 150 సీట్లు వచ్చేవి. కాలేజీలు నడపలేమంటూ ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాయడం చూస్తుంటే విద్యార్థుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో ఇట్టే తెలుస్తుంది. మెడికల్ కాలేజీ పనులు నిలుపుదల చేయడం సరికాదు. ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేదలు ఏ విధంగా చవువుకోగలరు. ప్రైవేట్ కళాశాలకు మేలు చేయడానికే ప్రభుత్వం ఈ విధమైన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం అవుతోంది. పేదలకు వైద్య విద్యను దూరం చేయాలని చేస్తే ఉద్యమిస్తాం.

-మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

బస్సుల కోసం విద్యార్థుల అవస్థలు

- బస్టాండుల్లో గంటల తరబడి నిరీక్షణ
- విద్యార్థులను వేధిస్తున్న బస్సుల కొరత
- సమయానికి చేరుకోలేక ఇబ్బందులు



గుర్రంకొండలో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ నెలకొనడంతో బస్సు ఎక్కడానికి కష్టాలు పడుతున్న విద్యార్థులు

గుర్రంకొండ: ఆర్టీసీ బస్సుల కోసం విద్యార్థులు ఎన్నో కష్టాలు పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి ఆర్టీసీ బస్టాండుల్లో నిరీక్షిస్తున్నారు. డిపోల్లో బస్సుల కొరత విద్యార్థులకు నానా కష్టాలు తెచ్చిపెడుతోంది. సమయపాలనలేని బస్సుల రాకపోకలతో పాఠశాలలు, కళాశాలలకు సమయానికి చేరుకోలేక విద్యార్థులు కష్టాలు పడుతున్నారు.

1600 మంది విద్యార్థులు నిత్యం రాకపోకలు

గుర్రంకొండ నుంచి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి గుర్రంకొండకు వచ్చి చదువుకోవడానికి రాకపోకలు సాగించే విద్యార్థుల సంఖ్య 1600 వరకు ఉంది. మండలకేంద్రమైన గుర్రంకొండలో రెండు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు జడ్పీ హైస్కూళ్లు, ఒక ఐటీఐ, ఆరు ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. కలిచెర్ల, పెద్దమండ్యం, వెలిగల్లు, మర్రిపూకులపల్లె, కోన, నడిమికండ్రిగ, నడిమిచెర్ల, చెర్లోపల్లె, కదిరాయచెరువు, సరిమడుగు, తాండా, ఎల్లుట్ల, సంగసముద్రం గ్రామాల నుంచి నిత్యం వేలాది మంది విద్యార్థులు ఇక్కడి వస్తుంటారు. రాయచోటి, కురబలకోట, మదనపల్లెలోని పలు విద్యా సంస్థలకు ప్రతి రోజు 600 మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు.

సరిపడా బస్సులేవీ..?

అయితే వీరికి సంఖ్యకు సరిపడా సరైన బస్సు సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో గుర్రంకొండతో పాటు పరిసర గ్రామల నుంచి వందలాది వుంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయాల్లో ఆయా మర్గాల్లో బస్సు సర్వీసులు లేక పోవడంతో కష్టాలు ఎదుర్కొంటున్నారు. బస్టాండుల్లో గంటలతరబడి వేచి చూడాల్సి పరిస్థితి. సకాలంలో కళాశాలలకు, పాఠశాలలకు చేరుకోలేక విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. తగినన్ని బస్సు సర్వీసులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మదనపల్లె నంచి గుర్రంకొండకు చేరుకోవడానికి సొరైన బస్సు సౌకర్యాలు లేక పోవడంతో విద్యార్థులకు ఇళ్లకు చేరుకొనేసరికి రాత్రిళ్లు అవుతోంది.

ప్రత్యేక స్టూడెంట్ బస్సు సర్వీసులేవీ?

విద్యార్థుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని గతంలో మదనపల్లె బస్సుడిపో వారు రెండు ప్రత్యేక స్టూడెంట్ బస్సు సర్వీసులు నడిపేవారు. ఉదయం 8 గంటలకు గుర్రంకొండ బస్టాండులో ఈబస్సులు బయలుదేరేవి. కేవలం విద్యార్థులకు మాత్రమే ఇందులో ప్రయాణించడానికి అనుమతి ఉండేది. మళ్లీ సాయంకాలం పాఠశాలలు వదిలే సమయంలో ఇవే బస్సులు గుర్రంకొండకు విద్యార్థులను చేరవేసేవి. దీంతో కొంతవరకు విద్యార్థులకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం ప్రత్యేక స్టూడెంట్ బస్సు సర్వీసుల జాడే కనిపించకుండా పోయింది. నిత్యం సాధారణ ప్రయాణికులకోసం వేసిన బస్సుల్లోనే విద్యార్థులు కూడా ప్రయాణించవలసి వస్తోంది. వందలాది మంది విద్యార్థులకు బస్సుల్లో చోటు దక్కాలంటే నానా కష్టాలు, చీవాట్లు, ఛీదరింపులు తప్పడం లేదు. ఒక్కో సారి ఆర్టీసీ బస్‌పాస్‌లున్నా విద్యార్థులు ఆటోలు, ప్రైవేట్ బస్సులో ప్రయాణించవలసిన పరిస్థితి నెలకొంది.

బస్సులు అదనంగా నడపాలి



పాఠశాలలకు వేళ్లే సమయంలో ఆర్టీసీ వారు అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి. ఉదయం, సాయం కాలం వేళల్లో బస్సులు లేక ఇబ్బంది పడుతున్నాం. బస్సులు లేక ఒక్కో సారి పాఠశాలలకు చాలా ఆలస్యంగా చేరుకోవాల్సి వస్తోంది. దీంతో చదవులు దెబ్బ తింటున్నాయి. విద్యార్థుల సమస్యలు అర్థం చేసుకొని అధికారులు బస్సులు నడపాలి.

- చరణ్, విద్యార్థి, గుర్రంకొండ

ప్రత్యేక బస్సులు నడపాలి



విద్యార్థుల కోసం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడపాలి. పాఠశాలల సమయాల్లో ఉదయం సాయంకాలం తప్పనిసరిగా ప్రత్యేక స్టూడెంట్ బస్సు సర్వీసులు నడిపితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. గతంలో గుర్రంకొండ నుంచి మదనపల్లె మార్గంలో రెండు స్టూడెంట్ బస్సులు నడిపేవారు. వాటిని మళ్లీ నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకొంటే కష్టాలు తీరుతాయి.

-లక్ష్మీదేవి, విద్యార్థిని తల్లి, గుర్రంకొండ

వెంకటరమణారెడ్డి కుటుంబీకులకు మాజీ మంత్రి పరామర్శ



వెంకటరమణా రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరు : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భవనం వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. శనివారం మండలంలోని వేపులబైలు పంచాయతీ గాయంవారిపల్లెలో నిర్వహించిన వెంకటరమణారెడ్డి తల్లి రంగమ్మ కర్మక్రియల్లో పాల్గొని, ఆమె చిత్రపటంవద్ద నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లారి తమ్మారెడ్డి, ఎస్వీ చలపతి, పుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, గాయం.మధుసూదన్‌రెడ్డి, యర్రంరెడ్డి, మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, సధుం జెడ్పీటీసీ సభ్యులు సోమశేఖర్ రెడ్డి, నారే వెంకటరమణారెడ్డి, అమరనాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఆనంద్, షాకీర్, మునీర్, కాలేష, హబీబ్, రమణ, విక్టరీ,పరమేష్ పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభించండి



తట్టివారిపల్లె జంక్షన్‌లో పరిహారం చెల్లించాలని నిరసన తెలుపుతున్న స్థానికులు

- తట్టివారిపల్లె జంక్షన్‌లో స్థానికుల ధర్నా
- నోటీసులు ఇవ్వకుండానే పనులు చేయడంపై ఆగ్రహం

మదనపల్లె : తిరుపతి-మదనపల్లె ఫోర్‌లేన్ రహదారి నిర్మాణంలో భాగంగా ఎన్‌హెచ్-71కు సంబంధించి తట్టివారిపల్లె జంక్షన్‌లో చేస్తున్న పనులపై శనివారం స్థానికులు అభ్యంతరం తెలిపారు. రహదారి విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోతున్న తమకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పనులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం ఇచ్చాకే పనులు చేసుకోండంటూ తిరుపతి-మదనపల్లె జాతీయరహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ...ఎన్‌హెచ్-71 విస్తరణ పనుల్లో భాగంగా...హైవేకు ఆనుకుని నివాసం ఉంటున్న ఇళ్లకు వచ్చే తాగునీటి పైప్‌లైన్లు, శానిటేషన్ పైపులను ఇష్టారాజ్యంగా తొలగించడం, ఇంటి ముందు ఉన్నటువంటి చెట్లను నరికివేయడం, ఉదయం నుంచి సాయంత్రం వరకు కరెంటు కట్ చేస్తుండటంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రజా సౌకర్యం కోసం నిర్మిస్తున్న రహదారి పనులకు తాము వ్యతిరేకం కాదని, తమకు ఎలాంటి పరిహారం చెల్లించకుండానే పనులు చేస్తుండటంపై మాత్రమే తమకు అభ్యంతరమన్నారు. సబ్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు పలుమార్లు ఇక్కడకు వచ్చినప్పుడు, పరిహారం చెల్లింపు విషయమై వారితో మాట్లాడినప్పటికీ, అదిగో, ఇదిగో అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారే కానీ తమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం చెప్పాపెట్టకుండా ఏకంగా పనులు చేసేస్తుండటంతో గత్యంతరం లేక తాము రోడ్లపైకి రావాల్సి వచ్చిందన్నారు. తహసీల్దార్ కార్యాలయంకు వెళితే సర్వేయర్ వస్తారని, రీ సర్వే చేసి అందరికీ న్యాయం చేస్తామని చెప్పి పంపేస్తారే తప్ప తమ గోడు పట్టించుకోలేదని వాపోయారు. పరిహారం ఇచ్చేంతవరకు పనులు జరపవద్దన్నారు. నిరసన తెలిపిన వారిలో ఇందిర, ప్రణతి, ఆసాది సూర్యనారాయణ, చామంచి.సాలమ్మ, రుతమ్మ, ఉమా తదితరులు ఉన్నారు.

కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గం



వాల్మీకిపురం: కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గురు అరవింద్



పీలేరు: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

వాల్మీకిపురం: రాజీమార్గంతోనే దీర్ఘకాలిక కేసులకు పరిష్కారం దొరుకుతుందని జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులకు సంబంధించి 76 కేసులను ఒకే రోజులో పరిష్కరించారు. తద్వారా రూ.65,06,470 నగదును రికవరీ చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ మూర్తయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

184 కేసులు పరిష్కారం

మదనపల్లె: స్థానిక రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 184 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్ 63, క్రిమినల్ 121 కేసులు పరిష్కరించి రూ.3,42,01,500 కోట్ల నష్ట పరిహారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి అబ్రహాం, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లునాయక్, స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు చలపతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

60 కేసులు పరిష్కారం

పీలేరు రూరల్: జాతీయ లోక్‌అదాలత్‌లో 60 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కోర్టు ఆవరణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో వివిధ రకాల కేసులు సంబంధించి 60 కేసులు పరిష్కారం కాగా రూ.80,02,200 రికవరీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.రవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, న్యాయవాదులు చిన్నరెడ్డప్ప, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆప్కాస్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సర్వజన బోధనాసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న ఆప్కాస్ సిబ్బంది

మదనపల్లె : ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో పనిచేస్తున్న ఆప్కాస్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట భిక్షాటనతో నిరసన తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సిబ్బంది చేస్తున్న నిరసన కార్యక్రమాలు శనివారానికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో 26 మంది ఔట్‌సోర్సింగ్(ఆప్కాస్) సిబ్బంది పనిచేస్తున్నారని, వీరిలో నలుగురికి 13 నెలలుగా, మరో 22 మందికి 7 నెలలుగా వేతనాలు రాలేదన్నారు. జీతాలు లేని కారణంగా ఆప్కాస్ సిబ్బంది కుటుంబసభ్యుల పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తిరుమల, సాంబశివ, కృష్ణప్ప, దేవా, ఆప్కాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వాల్మీకిపురంలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న కాలనీ వాసులు

వాల్మీకిపురం: పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీలో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహాన్ని శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అలంకరించిన పల్లకిలో గణేషుని విగ్రహాలను ఏర్పాటు చేసి పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువత కేరింతలు కొడుతూ ఉల్లాసంగా నృత్యాలను చేశారు. సాయంత్రం దాకా పురవీధుల్లో ఊరేగించి పట్టణ శివారు ప్రాంతంలోని చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే వాల్మీకిపురం పంచాయతీ గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేశారు.

రామసముద్రంలో..

రామసముద్రం: మండల కేంద్రంలోని దిగువహరిజనవాడలో శనివారం వినాయక నిమజ్జనం వేడుకలు వైభవంగా నిర్వహించారు. యువత చిన్నారులు, మహిళలు, నిమజ్జనం కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు నృత్యాలతో ఊరేగింపులో జై బోలో గణేష్ మహరాజ్‌కి జై అని నినాదాలు చేశారు.

దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

గుర్రంకొండ: బీజేపీ సభ్యత్వం తీసుకొని ప్రజలు దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని బీజేపీ పార్లమెంట్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కలకడ క్రాస్‌లో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు చురుగ్గా నిర్వహించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో మండలబీజేపీ అధ్యక్షులు రామాంజులు, రైల్వేకమిటి సభ్యులు చింతిర్ల శ్రీనివాసులు, రామాంజులురెడ్డి, నాయకులు భరత్, రమేష్‌రెడ్డి, వరదరాజులు, వెంకట్‌లు పాల్గొన్నారు.

అబూబకర్‌కు సేవారత్న అవార్డు

మదనపల్లె సిటీ: బెంగళూరులోని జుక్కుర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్‌లో సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్ధిక్‌కు సేవారత్న అవార్డును అందజేశారు. మదనపల్లె పట్టణంలో ఫుడ్‌బ్యాంకు, శానిటరీ ప్యాడ్ బ్యాంక్, ఉచిత బాడీఫ్రీజర్ బాక్స్, క్యాన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు, రక్తదానశిబిరాలు వంటివి చేయడంతో సంస్థ సేవలను గుర్తించి అవార్డును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, నవీన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు ప్రభుత్వ కలాశాలకు పరిశోధన ప్రాజెక్ట్ మంజూరు



ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

పీలేరు రూరల్ : స్థానిక సంజీవ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీకళాశాలకు పర్యావరణ పర్యాటకంపై పరిశోధన ప్రాజెక్ట్ మంజూరైనట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్థానిక కళాశాలలో వాణిజ్యశాస్త్రంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ యం.వెంకట్రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పరిశోధన ప్రాజెక్టను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈప్రాజెక్ట్‌కుగాను రూ. 24 లక్షలు మంజూరు చేసి ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకకేంద్రాలపై అధ్యయనం చేయడానికి ఈ నిధులు ఖర్చుచేయాలని నిబంధనలు ఉన్నట్లు తెలిపారు. ఈనివేదికలను ఐసీఎస్ఎస్ఆర్-న్యూ ఢిల్లీ వారికి ఏడాది లోపు పూర్తి నివేదికలు అందజేయనున్నట్లు తెలిపారు. పీలేరు కళాశాలకు ఈప్రాజెక్ట్ మంజూరు చేయడంతో ప్రాధాన్యతను ఇచ్చినట్లు అయిందన్నారు.

కనువిందుగా వెంకన్నకు పవిత్ర సమర్పణ



స్వామికి పవిత్రాలను తీసుకెళుతున్న వేదపండితులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మూడు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కృష్ణభట్టార్, ఆలయ అర్చకులు రమేష్‌చార్యులు సంప్రదాయబద్ధంగా ఆగమ శాస్త్రం మేరకు స్వామికి పవిత్రాలను సమర్పించారు. పూజలు,అభిషేకాలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తులకు కనువిందు చేసే విధంగా నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ దుష్యంతకుమార్, నగేష్, రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.